క్లుప్తంగా

కాజలో మినుము పంట పరిశీలన



మంగళగిరి: నగర పరిధిలోని కాజ గ్రామంలో ఉన్న పంట భూములను వ్యవసాయ శాస్త్రవేత్తలు మంగళవారం సందర్శించారు. మంగళవారం మినుము ఎల్‌బీజీ-904 వెరైటీ విత్తనాలు వేసిన పొలాన్ని లాం శాస్త్రవేత్తలు డయాగ్నోటిక్ విజిట్‌లో భాగంగా సందర్శించారు. పెసర, మినుములో పౌడర్ మిల్డ్యూ(బూడిద తెగులు)ను గుర్తించి నివారణకు వేప నూనె లేదా కార్బెండేజీ 550జీ/హే లేదా వెట్టబుల్ సల్ఫర్ 2 కేజీ/హే పిచికారి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ సైంటిస్ట్(అగ్రానమి) వెంకటరావు, బ్రీడర్ సతీష్, ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ వెంకటలక్ష్మి, మండల వ్యవసాయ అధికారిణి జెడ్ శైలజారాణి పాల్గొన్నారు.

వైభవంగా గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణం

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని గోపయ్య సమేత లక్ష్మీతిరుపతమ్మ ఆలయ 23వ వార్షికోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. ఉదయాన్నే ఆలయంలో గణపతిపూజ, మండపారాధన, పుణ్యాహవాచనం, పూజలు చేసి లక్ష్మీతిరుపతమ్మకు అష్టోత్తర, సహస్త్ర నామ పూజలు అర్చకులు పూర్ణ నాగసాయి నిర్వహించారు. సాయంత్రం లక్ష్మీగణపతి హోమం చేసి విశేష అర్చనలు చేశారు. భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమాలను ఆలయ పాలకవర్గ సభ్యులు పర్యవేక్షించారు.

వేగవంతంగా ఎన్‌సీడీ సీడీ సర్వే

ఫిరంగిపురం: మండలంలోని పలు గ్రామాల్లో ఎన్‌సీడీసీడీ సర్వే వేగవంతంగా నిర్వహిస్తున్నట్లు ఫిరంగిపురం, నుదురుపాడు పీహెచ్‌సీ వైద్యులు శ్వేత, ఫరీనాబేగం మంగళవారం తెలిపారు. సర్వేలో భాగంగా ఆరోగ్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి వ్యక్తుల ఆరోగ్య వివరాలు తెలుసుకుని వాటిని యాప్‌లో నమోదు చేస్తున్నారన్నారు. వాటితో పాటు క్యాన్సర్ కారణాలపై మహిళలకు అవగాహన కల్పిస్తున్నారని చెప్పారు. బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలు, గర్భ సంచిలో వచ్చే సమస్యలు వాటిని గుర్తించే విధానం గురించి వివరిస్తున్నారని తెలిపారు.

లక్ష్మణరావు గెలుపునకు విస్తృత ప్రచారం



తాడేపల్లిరూరల్: కృష్ణా, గుంటూరు జిల్లాల పీడీఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి కేఎస్ లక్ష్మణరావు విజయాన్ని కాంక్షిస్తూ తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లిలో మంగళవారం ప్రజా సంఘాల నాయకులు కరపత్రాలు పంపిణీ చేశారు. పట్టభద్రులను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా రైతు సంఘం గుంటూరు జిల్లా అధ్యక్షుడు జొన్న శివశంకరరావు మాట్లాడుతూ లక్ష్మణరావును ఎమ్మెల్సీగా గెలిపించుకోవడం అందరి బాధ్యత అన్నారు. లక్ష్మణరావు ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యలపైనే కాకుండా రైతాంగ, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై ప్రశ్నించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ తాడేపల్లి మండల నాయకులు దొంతిరెడ్డి వెంకటరెడ్డి, కౌలు రైతు సంఘం నాయకులు అమ్మిశెట్టిరంగారావు, కేవీపీఎస్ నాయకులు నల్లపు కిషోర్ బాబు పాల్గొన్నారు.

దివ్యాంగుడికి ట్రై సైకిల్ అందజేత



మంగళగిరి టౌన్: మంగళగిరి నగర పరిధిలోని ఆత్మకూరుకు చెందిన దివ్యాంగుడు మేడవరపు రామాంజనేయులుకు పల్లెటూరి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ జొన్న రాజేష్ మంగళవారం ట్రై సైకిల్ అందజేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారికి తమవంతు సాయం అందించి అండగా నిలుస్తామని భరోసా ఇచ్చారు. రామాంజనేయులకు ఒక నెలకు సరిపడా సరుకులు, బియ్యం కూడా అందజేసినట్లు పేర్కొన్నారు. ట్రస్ట్ సభ్యులకు రామాంజనేయులు కృతజ్ఞతలు తెలిపారు. ట్రస్ట్ సభ్యులు సామల నాగేశ్వరరావు, వాసా శ్రీనివాసరావు, పద్మశాలీ కార్పొరేషన్ డైరెక్టర్ పర్వతం మధు తదితరులు పాల్గొన్నారు.

కాల్వల్లో వ్యర్థాలను తొలగించండి

తెనాలిఅర్బన్: మురుగు కాల్వల్లో వ్యర్థాలను పూర్తిగా తొలగించాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. మారీసుపేటలో మంగళవారం గ్యాంగ్ వర్కు పనులను ఆయన పరిశీలించారు. కాల్వల్లో పైన పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించడం వలన పారుదల జరగదని చెప్పారు.

తపాలా ధరలు మోది

- పోస్టల్ చార్జీలు భారీగా పెంపు
- పుస్తక ప్రియులపై పిడుగు
- తపాలా సేవలు ఇక ప్రియం
- కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

బుక్‌పోస్ట్ సర్వీసుల రుసుము పెంపు... పుస్తక ప్రియుల పాలిట శరాఘాతమైంది. ఈ సర్వీస్‌కు మోదీ సర్కార్ ధరల మోత మోగించింది. ఉత్తరాలు, మనీ ఆర్డర్లు, బట్వాడా నుంచి బ్యాంకింగ్ సేవల వరకు దశల వారీగా విస్తరిస్తూ వచ్చిన తపాలా శాఖ బుక్‌పోస్ట్‌పై భారీగా షాకిచ్చింది. దీంతో వార, పక్ష, ఆధ్యాత్మిక పుస్తకాల బట్వాడాపై ధరల మంట మండింది.



మంగళగిరి హెడ్ పోస్టాఫీస్

తాడేపల్లిరూరల్ : బుక్ పోస్ట్ సర్వీస్ పేరుతో ఇంత కాలం అతి తక్కువ ధరకే కోరుకున్న పుస్తకాన్ని పాఠకుడికి అందజేసేవారు. తాజాగా మూడు రకాల బుక్‌పోస్టులను ఒకే విభాగం కిందకు తెస్తూ ప్రింటెండ్ బుక్ పోస్టు 'రిజిష్టర్డ్ బుక్‌పోస్ట్'గా మార్చి సేవల చార్జీలు పెంచారు. ఈ క్రమంలోనే నాలుగు రకాలుగా ఉన్న పోస్టు కార్డులను ఒకే విభాగం కిందకు తెచ్చారు. రిజిష్టర్ బుక్‌పోస్ట్ కాలమ్‌ను గత ఏడాది డిసెంబర్ 18 నుంచి ఏకంగా సాఫ్ట్‌వేర్ నుండి రహస్యంగా తొలగించడం, తపాలా ఉద్యోగులతో పాటు అందరినీ షాక్‌కు గురిచేసింది. కేంద్రం తీసుకున్న ఈ నిర్ణయం పుస్తకాలతో పాటు దిన, వార, పక్ష పత్రికల బట్వాడాపై తీవ్ర ప్రభావం చూపనుంది.

ప్రైవేటు సేవలతో పోలిస్తే


ప్రైవేటు కొరియర్ సర్వీసులతో పోలిస్తే ఇప్పటి వరకు తపాలా శాఖ చాలా తక్కువ ధరలకు తరలింపు సేవలు అందిస్తోంది. కానీ నూతన కఠిన నిర్ణయాలతో ప్రైవేటు కొరియర్ సేవలే మేలనే పరిస్థితి వచ్చిందని వినియోగదారులు అంటున్నారు. తాము ఫోన్ చేస్తే చాలు, పబ్లిషర్లు ఇంటికే పుస్తకాలు పంపుతున్నారని గుర్తుచేసుకుంటున్నారు. దేశంలో ఏ మారుమూల ప్రాంతం నుంచైనా పుస్తకాలు, వార, పక్ష పత్రికలు తెచ్చుకోవాలంటే 5 కిలోలు బరువు వున్న పార్శిల్‌కు గతంలో రూ.80లు చెల్లించేవారని, ఇప్పుడు అదే బరువు ఉన్న పార్శిల్‌కు రూ.365లు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రిజిష్టర్ బుక్‌పోస్ట్ ద్వారా 200 పేజీల పుస్తకాన్ని జీఎస్టీతో కలిపి రూ.25లు పంపేవారు. ఇప్పుడు ఆ సర్వీస్‌ను తపాలా శాఖ రద్దుచేయడంతో తప్పని పరిస్థితుల్లో పుస్తకాన్ని రిజిష్టర్ పార్శిల్‌లో మాత్రమే అందుకోవాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రూ.100లు విలువ చేసే పుస్తకాన్ని పాఠకుడు పోస్టల్‌లో తెప్పించుకోవాలంటే రూ.80లు పోస్టల చార్జీల కింద భరించాల్సి ఉంటుంది. ఇంత భారం భరించి పుస్తకాలను తెప్పించుకునేవారు ఎవరుంటారు? అనే ప్రశ్న ఉత్పన్నమౌతోంది.

బుక్‌పోస్ట్ బరువు	పాత ధర(రూ.)	కొత్త ధర(రూ.)
100 గ్రాములు	22.00	28.00
కేజీ	27.00	92.00
2 కేజీలు	43.50	163.00
3 కేజీలు	56.40	234.00
4 కేజీలు	67.00	304.00
5 కేజీలు	79.00	365.00

దిగుమతి సుంకంపై ఆందోళన

శాంపిల్ పుస్తకాలపై 5 శాతం దిగుమతి సుంకం విధించడం మరింత ఆందోళనకు గురిచేస్తోంది. ప్రాంతీయ భాషలో ముద్రించిన పుస్తకాలను విదేశీ భాషల్లోకి అనువాదం చేసి ప్రచురిస్తుంటారు. ఇలాంటి సందర్భాల్లో విదేశీ పబ్లిషర్లు ఆ పుస్తకాల కాంప్లిమెంటరీ కాపీలను పంపుతుంటారు. ఇలా విదేశాల నుండి వచ్చే పుస్తకాలపై తొలిసారి కేంద్రం దిగుమతి సుంకం విధించింది. వాణిజ్య ప్రయోజనాలతో విక్రయించేందుకు ఉద్దేశించిన పుస్తకాలపై దిగుమతి విధించడం సమర్థనీయమే అయినా కాంప్లిమెంటరీగా పంపే పుస్తకాలపై సుంకం పేరిట అదనపు భారం మోపటం దుర్మార్గమేనన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పుస్తకాలకు దూరం చేయడమే



కేంద్రం తీసుకున్న కొత్త నిర్ణయంతో పాఠకులు పుస్తక పఠనానికి దూరమయ్యే అవకాశం ఉంది. ఇది సరైన నిర్ణయం కాదు. మరిన్ని రాయితీలు ఇచ్చి ప్రోత్సహించాల్సింది పోయి ఇలా చేయడం సరికాదు. ధరలు పెంచితే పుస్తకాలు కొనేదెవరు? తెప్పించుకునేదెవరు? ఇప్పటికైనా కేంద్రం పునరాలోచించి తమ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలి.

– నజీర్, రచయిత

రిజిస్ట్రేషన్‌కు దరఖాస్తు చేసుకోండి



దుగ్గిరాల: ప్రభుత్వ పథకాలు లబ్ధిపొందడానికి పొలం ఉన్న ప్రతి రైతు తప్పనిసరిగా తమ పేరు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారిణి పి.శిరీష పేర్కొన్నారు. ఈమని గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని మొక్కజొన్న పంటలను పరిశీలించి, భూసారీ పరీక్షలు నిర్వహించారు. ఏఈవో, వీఏఏలు, రైతులు పాల్గొన్నారు.

నేటి నుంచి విఘ్నేశ్వర స్వామి ఆలయ వేడుకలు

మేడికొండూరు: మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో వరసిద్ధి విఘ్నేశ్వరస్వామి నూతన ఆలయ వేడుకలు బుధవారం నుంచి ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం వరకు ఐదు రోజులు పాటు ఈ వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. ప్రత్యేక పూజలు వేద పండితుల ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నామన్నారు. పూజలలో భక్తులు వేలాదిగా పాల్గొని కార్యక్రమాలను జయప్రదం చేయాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్: ఏసీసీ కార్మికుల న్యాయమైన సమస్యను కూటమి ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతున్నట్లు తాడేపల్లి సీఐటీయూ నాయకులు వేముల దుర్గారావు అన్నారు. మంగళవారం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని నాయకులు కె.ఆదినారాయణ, కూరపాటి స్టీవెల్‌తో కలసి ప్రారంభించి, మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా వేముల దుర్గారావు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ ఎన్నికల ముందు కార్మికుల సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని, హామీని నిలబెట్టుకునే విధంగా చూడాలని కార్మికులు కోరుతున్నారని అన్నారు. ఎం.ఆశీర్వాదం, బి.అంకయ్య, ఎం.గురవయ్య, వి.రమణ, మల్లేశ్వరి, మూర్తి, హగ్గయ్య పాల్గొన్నారు.



మద్దతు తెలిపిన సీఐటీయూ నాయకులు దుర్గారావు

కుష్టు వ్యాధిపై అవగాహన

మంగళగిరి టౌన్: కుష్టు వ్యాధిపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని లెప్రసి డీపీఎంవో జోసఫ్ అన్నారు. మంగళగిరి నగర పరిధిలోని సీకే హైస్కూల్‌లో మంగళవారం కుష్టు వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ చర్మంపై స్పర్శలేని మచ్చలు, చెవులపై, వీపుపై, ఎదపై నొప్పి లేని బొడిపెలు, కనుబొమ్మలు, కనురెప్పల వెంట్రుకలు రాలిపోవడం వంటి లక్షణాలు ఉన్నవారు స్థానిక వైద్యశాలకు వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ముఖ్యంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలలు, రెసిడెన్షియల్ కళాశాలల్లోని విద్యార్థులకు కుష్టుపై అవగాహన కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. సీకే జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ రత్నబాబు, డెర్మటాలజిస్ట్ లక్ష్మీనారాయణ, మార్కండేయ కాలనీ యూపీహెచ్‌సీ వైద్యులు హర్షవర్ధన్, ఏఎన్ఎం వనజ, ఆశ వర్కర్ నూర్జహాన్ విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న వైద్యులు

సరఫరా నిలిపివేయకపోతే క్రిమినల్ కేసు

ఎండీయూ ఆపరేటర్‌కు సివిల్ సప్లయీస్ డీటీ వార్నింగ్

తాడికొండ: రేషన్ బియ్యం సరఫరా నిలిపివేయకపోతే క్రిమినల్ కేసు నమోదు చేస్తామంటూ తుళ్లూరు సివిల్ సప్లయీస్ డీటీ అత్యుత్సాహం ప్రదర్శించారు. తుళ్లూరు మండలంలో రేషన్ బియ్యం వాహనం ఆపరేటర్ వీర్లంకయ్యను గత పది రోజులుగా టీడీపీ నాయకులు ఇబ్బందులకు గురిచేస్తున్న వైనంపై మంగళవారం సాక్షిలో కథనం ప్రచురితమైంది. 11 రోజులుగా బోరుపాలెం, దొండపాడు, హరిశ్చంద్రపురం గ్రామాల్లో బియ్యం పంపిణీ పూర్తి కాకపోవడంతో లబ్ధిదారులు మండిపడుతున్నారు. ఆయా గ్రామాల్లో టీడీపీ నాయకులు అత్యుత్సాహంతో రేషన్ బియ్యం సరఫరా నిలిచిపోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు టీడీపీ నాయకులతో కుమ్మక్కై ఎండీయూ ఆపరేటర్‌ను విధుల నుంచి అక్రమంగా తొలగించేందుకు చేస్తున్న కుట్రను ప్రజలు గమనించారు. వీఆర్వో ఆపరేటర్‌కు ఏమైనా ఉంటే నాయకులతో మాట్లాడుకోమని చెబుతుంటే.. సీఎస్ డీటీ అత్యుత్సాహం ప్రదర్శిస్తూ సదరు ఎండీయూ వాహనం ఆపరేటర్‌ను వాహనాల ఆపరేటర్‌ల గ్రూపు నుంచి తొలగించారు. కనీసం సమాధానం కూడా చెప్పకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నాడని బాధితుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై తహసీల్దారు సుజాతను వివరణ కోరగా వాహనం నిలిపివేసిన వ్యవహారంపై తనకు సమాచారం లేదని చెప్పడం విశేషం.

అలరించిన సాంస్కృతిక సంబరాలు



సాంస్కృతిక కార్యక్రమంలో కళాకారులు

నూతక్కి(తాడేపల్లిరూరల్): మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నూతక్కిలో మంగళవారం గ్రామీణ కళాకారుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో సాంస్కృతిక సంబరాలు నిర్వహించారు. శ్రీ శక్తేశ్వరస్వామి ఆలయం వద్ద నూతక్కికి చెందిన ప్రఖ్యాత రంగస్థల కళాకారులు జొన్నల సుబ్బారెడ్డి, అన్నపురెడ్డి శివరామరెడ్డి సంస్మరణార్థం నిర్వహించిన సాంస్కృతిక సంబరాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఎ. వెంకటలక్ష్మి చేసిన నృత్య ప్రదర్శన ప్రత్యేకంగా నిలిచింది. సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షించేందుకు నూతక్కితో పాటు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమాన్ని జొన్నల పేరిరెడ్డి, కొల్లి సంజీవరెడ్డి నిర్వహించారు.



సంస్మరణ సభ

హెల్మెట్ లేకుంటే నగరంలో నో ఎంట్రీ

పట్టణ సీఐ వినోద్‌కుమార్



మంగళగిరి టౌన్: హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపే వారికి నగరంలోకి ఎంట్రీ లేదని మంగళగిరి పట్టణ సీఐ వినోద్‌కుమార్ ద్విచక్ర వాహనదారులను హెచ్చరించారు. మంగళగిరి నగర పరిధిలోని ఆల్ఫా సెంటర్ వద్ద మంగళవారం ద్విచక్ర వాహనాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా హెల్మెట్ లేని ద్విచక్రవాహనదారులను ఆపి హెల్మెట్ ఆవశ్యకతను వివరించారు. కొంతమంది ద్విచక్ర వాహనదారులు ఇంటి వద్ద హెల్మెట్ ఉందని చెప్పడంతో వాహనం వెనుక ఉన్న మరో వ్యక్తితో ఇంటికి పంపించి హెల్మెట్ తెప్పించి, వాహనదారుడికి హెల్మెట్ ధరించిన తర్వాతే పంపించారు. ఈ సందర్భంగా సీఐ వినోద్‌కుమార్ మాట్లాడుతూ ద్విచక్రవాహనదారులు రోడ్డు ప్రమాదాలకు గురైనప్పుడు ప్రాణాలతో బయట పడేందుకు హెల్మెట్ రక్షణ కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్ఐ నాయక్, సిబ్బంది బాబూరావు, సుధీర్ పాల్గొన్నారు.

నేడు భావనారుషి స్వామి కల్యాణం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణంలోని పద్మశాలీయ బజార్‌లో వేంచేసి యున్న భద్రావతి సమేత భావనా ఋషి కల్యాణ మహోత్సవాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు మంగళవారం ఆలయ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. రాత్రి జరిగే ఊరేగింపునకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. 14న అన్న సంతర్పణ నిర్వహించనున్నామని పేర్కొన్నారు. భక్తులు ఈ కల్యాణ మహోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

మందు బాబులకు కౌన్సెలింగ్



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో బహిరంగంగా మద్యం సేవించే వారికి మంగళవారం రాత్రి తాడేపల్లి పోలీసులు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ ఎస్కే ఖాజావలి మాట్లాడుతూ తాడేపల్లి సీఐ కల్యాణ్ రాజు ఆదేశాల మేరకు తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలోని ఉండవల్లి, బ్రహ్మానందపురం, పెనుమాక చుట్టు పక్కల ప్రాంతాలు, పంట పొలాలు, బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించామని తెలిపారు. సుమారు 22 మంది మందు బాబులకు కౌన్సెలింగ్ ఇచ్చినట్లు తెలిపారు.

విద్యాజ్యోతి మెటీరియల్ పంపిణీ



మెటీరియల్ అందుకున్న విద్యార్థులతో హెచ్‌ఎం శోభాదేవి

దుగ్గిరాల: కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకోవాలని దుగ్గిరాల జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్.శోభాదేవి పేర్కొన్నారు. ప్రభుత్వం పంపిన విద్యాజ్యోతి (మెటీరియల్)ని మంగళవారం 10వ తరగతి విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు విద్యలో రాణించాలనే ఉద్దేశంతో వీటిని ప్రభుత్వం ప్రతి సంవత్సరం పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. మెటీరియల్‌ను అందరూ ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

తాడేపల్లిరూరల్: వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీ ఏఐ, డీఎస్ ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో మంగళగిరి మండల పరిధిలోని ఆత్మకూరులో డిజిటల్ లావాదేవీలపై ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. వర్సిటీ విద్యార్థి విభాగాధిపతి డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్ మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీలు పెరిగిపోయాయని, వాటితో పాటే సైబర్ మోసాలు కూడా జరుగుతున్నాయన్నారు. సురక్షితమైన లావాదేవీలు నిర్వహించాలంటే నమ్మకమైన యాప్స్‌ను వినియోగించాలని ప్రజలకు సూచించారు. ఏఐ, డీఎస్ విభాగాధిపతి డాక్టర్ బి. తిరుపతిరెడ్డి మాట్లాడుతూ సైబర్ మోసానికి గురైతే వెంటనే 1905కు ఫిర్యాదు చేయాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కో ఆర్డినేటర్ డాక్టర్ పి. శ్రీకాంత్ రెడ్డి, ప్రోగ్రామ్ ఆఫీసర్ వి. జోనితిన్, సమన్వయకర్త పి.సురేష్, వలంటీర్ల యూనివర్సిటీ ఇన్‌చార్జి వైస్ చాన్సలర్ డాక్టర్ కె.రాజశేఖరరావు, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డీన్ డాక్టర్ హబీబుల్లా ఖాన్ విద్యార్థులను అభినందించారు.



గర్భిణులకు వైద్య పరీక్షలు

మంగళగిరి టౌన్: గర్భిణులు ప్రతి నెలా వైద్య పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలని యూపీహెచ్‌సీ వైద్యులు హర్షవర్ధన్ సూచించారు. ప్రధాన మంత్రి మాతృ వందన యోజన కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎత్తు, బరువు, బీపీ, షుగర్, హెచ్‌బీ, యూరిన్ తదితర పరీక్షలు చేసి మందులు అందజేశారు. డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ 20 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించగా అందులో ఇద్దరు హైరిస్క్ ప్రెగ్నెన్సీగా గుర్తించామని చెప్పారు. ప్రతి గర్భిణీ మూడు సార్లు అల్ట్రా సౌండ్ పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. యూపీహెచ్‌సీ ఏఎన్ఎంలు శైలజ, ప్రసన్న, ఆశ వర్కర్లు నూర్జహాన్, భారతి, సునీత, ల్యాబ్ టెక్నీషియన్ అనిత, సిబ్బంది ప్రేమ, దుర్గాభవాని పాల్గొన్నారు.



గర్భిణికి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ హర్షవర్ధన్

చోరీకి పాల్పడిన మహిళ పోలీసులకు అప్పగింత

మంగళగిరి టౌన్ : చోరీకి పాల్పడుతున్న ఓ మహిళను పట్టణ పోలీసులకు అప్పగించిన ఘటన మంగళవారం నగరంలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. మంగళగిరి నగర పరిధిలోని ఆటోనగర్ ఆఖరి లైన్‌లో ఓ గోడౌన్ ఉంది. ఆ గోడౌన్‌లో తలుపులు, గడియలు, తాళాలు, హార్డ్‌వేర్ సామాన్లు ఉన్నాయి. ఒక మహిళ గోడౌన్ కిటికీ పగలకొట్టి అందులో నుంచి బస్తాలతో సామాన్లను తీసుకువెళుతుండగా స్థానికులు గమనించారు. వారు దగ్గరకు రావడంతో బయట బస్తాలు అందుకుంటున్న మహిళతో పాటు ఆటోతో అక్కడే ఉన్న ఓ వ్యక్తి పరారయ్యారు. గోడౌన్‌లోపల ఉన్న మహిళను స్థానికులు పట్టుకుని పట్టణ పోలీసులకు అప్పగించారు. దొంగిలించిన సామాన్ల బస్తాతో సహా ఆటోలో వేసుకుని ఆటోను, ఆ మహిళను మంగళగిరి పట్టణ పోలీసులకు అప్పగించారు. పట్టుబడిన మహిళ నగరంలోని గండాలయ్యపేటకు చెందిన వ్యక్తిగా గుర్తించారు. పరారైన ఇద్దరిని పట్టుకునే పనిలో పట్టణ పోలీసులు నిమగ్నమయ్యారు.

ట్రాఫిక్ సమస్య లేకుండా వ్యాపారం చేసుకోవాలి

మంగళగిరి టౌన్: రోడ్డుకు ఇరువైపులా వ్యాపారం చేసుకునే చిరు వ్యాపారులు ట్రాఫిక్ సమస్య కాకూడదని మంగళగిరి రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకట్ హెచ్చరించారు. మంగళగిరి రూరల్ పరిధిలోని ఆత్మకూరు కూడలి వద్ద మంగళవారం సిబ్బందితో కలసి పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్డు మార్జిన్ దూరంగా తోపుడు బండ్లను పెట్టుకోవాలని సూచించారు. వాహనదారులకు, పాదచారులకు ఎటువంటి ఇబ్బంది కలిగించకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. కళాశాలల వద్ద ఆకతాయి చర్యలకు పాల్పడితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రూరల పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిరు వ్యాపారులకు సూచనలిస్తున్న రూరల్ ఎస్ఐ వెంకట్

సాఫ్ట్ టెన్నిస్ క్రీడాకారులకు అభినందన

తాడికొండ: రాష్ట్రస్థాయి సాఫ్ట్ టెన్నిస్ పోటీలలో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానంలో జిల్లా జట్టును నిలబెట్టారని పాఠశాల సీఈవో అమల తెలిపారు. ఈ నెల 8-9 తేదీలలో కర్నూలులో జరిగిన రాష్ట్రస్థాయి సబ్ జూనియర్ విభాగంలో 9వ తరగతి విద్యార్థులు వై.అభిషేక్, షేక్ జాహీద్, షేక్ సుభానీ, ఎన్ అవినాష్‌లు జిల్లా జట్టు తరుపున పాల్గొని జట్టుకు విజయాన్ని అందించడం తమ పాఠశాలకు గర్వకారణమన్నారు. సీఈఓ కె.అమల, హెచ్‌ఎం ఎన్‌వీ రమణయ్య విద్యార్థులను, పీఈటీ అనిల్‌ను ప్రత్యేకంగా అభినందించారు.